





# కరపత్రం

SINCE 2014

గురువారం ఏప్రిల్ 03 2025 | సంపుటి :0 | సంచిక : 171 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# బీసీలను బలపర్చాలనే ఆలోచనకు భాజపా వ్యతిరేకం

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది.**

**బీసీ సంఘాల ధర్నా - సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన వ్యాఖ్యలు**

- బీసీల గొంతు వినిపించేందుకు ధర్నా ఏర్పాటు.
- కోర్టుల ప్రకారం జనాభా లెక్కలు తేలాల్సిందే, కులగణన అనివార్యం.
- జనగణనతోపాటు కులగణన చేపట్టాలన్న కాంగ్రెస్ నిర్ణయం.
- బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచనకు భాజపా వ్యతిరేకం.
- కులగణన ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలి.



దిల్లీ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో దిల్లీ జంతర్‌మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "బీసీల గొంతు వినిపించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. జనాభా ఎంతో తెలియకుండా రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయి. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలి.జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలనేది మా పార్టీ నిర్ణయం. బీసీలను బలపర్చాలనే ఆలోచనకు భాజపా వ్యతిరేకం. బీసీల లెక్కలు తేల్చాల్సి వస్తుందని 2021 జనాభా లెక్కలను వాయిదా వేశారు. జనగణనతోపాటు కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆ నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలి" అని సీఎం అన్నారు.

# నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా చూస్తూ ఉండాల్సిందేనా?: సుప్రీంకోర్టు

దిల్లీ: ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

2లో

# కంచ గచ్చిబౌలి భూముల్లో రేపటివరకు పనులు ఆపాలి

- నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి.

2లో




# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్



హైదరాబాద్, : హైదరాబాద్ నగరవాసులకు మెట్రో సేవలు ఎంతో కీలకంగా మారాయి. ఎందుకంటే నగరంలో ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య వల్ల చాలా సమయం పడుతుంది. అదే మెట్రోలో వెళితే.. నిమిషాల్లో వెళ్లవచ్చు. అందుకే చాలామంది మెట్రోలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మెట్రో సేవల సమయాన్ని పొడిగించాలని ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తున్నారు. మన భాగ్యనగరంలో తక్కువ కాలంలోనే పాపులర్‌గా మారిన మెట్రో రైలు సర్వీసులు విషయంలోనూ అనేక మంది ప్రయాణికులు రాత్రి 12 గంటల వరకు సేవలు సేవలు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. ఎట్టకేలకు అది నెరవేరింది. ప్యాసింజర్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది హైదరాబాద్ మెట్రో.

2లో

# అడవులో వణ్య ప్రాణాలు ఘోష వినపడటం లేదా..?

**హెచ్‌సీయూ ఘటన ఫలితం రేవంత్ అనుభవిస్తాడు రేవంత్‌ను జైలులో పెడితే కానీ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండదు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**




హైదరాబాద్, ఎంతమంది మేధావులు, విద్యావంతులు హెచ్చరిస్తున్నా హెచ్‌సీయూ భూములను లాక్కుకుంటున్నారని.. ఇది ఫలితం రేవంత్‌రెడ్డి తప్పక అనుభవిస్తాడని ఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. హెచ్‌సీయూ బయో డైవర్సిటీ పార్క్ విధ్వంసం, భూముల కుంభకోణంలో కాంగ్రెస్ గుంట నక్కల ముఠాపై వెంటనే సుమోటోగా కింది కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 29, అటవీ సంరక్షణ చట్టం 1980లోని సెక్షన్ 2, తెలంగాణ వాల్టా చట్టం 2002లోని సెక్షన్ 35 కింద

2లో

# ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

**విద్యార్థులను చితకబాదిన పోలీసులు**

హైదరాబాద్, హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.



# అక్రమ మైనింగ్ కేసు.. కాకాణి గోవర్ధన్‌కు మరోసారి నోటీసులు




2లో

## ఢిల్లీ బాసుల జేబులు నింపేందుకే భూముల అమ్మకం : ఎర్రోళ్ల శ్రీనివాస్



ఢిల్లీ బాసుల జేబులు నింపేందుకు.. గల్లీలో భూములను తెగనమ్ముతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగినట్లుగా సెంట్రల్ యూనివర్సిటీలోనూ లాఠీఛార్జ్ జరుగుతుందని మండిపడ్డారు. విద్యార్థులను గదుల్లోకి వెళ్లి లాక్కొచ్చి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఒక్క తెలంగాణలే లేరని.. దేశ నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారని.. విద్యార్థులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. భట్టి, శ్రీధర్‌బాబు సెంట్రల్ యూనివర్సిటీలోనే చదివారని.. సెంట్రల్ యూనివర్సిటీపై భట్టి, శ్రీధర్ బాబుకు ప్రేమ లేదా? అని నిలదీశారు. విద్యార్థులు చేస్తున్న పోరాటానికి భట్టి, శ్రీధర్ బాబు మద్దతు తెలుపుతారని అనుకున్నామన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విద్యార్థులకు ప్రయోజనం లేదని.. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని తిట్టడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎజెండా లేదని విమర్శించారు. పేమెంట్ బ్యాచ్ ఎవరో అందరికీ తెలుసునని.. ఢిల్లీ బాసుల జేబులు నింపేందుకే గల్లీలో భూములు అమ్ముతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం, పీసీసీ, మంత్రి పదవులు, ఎమ్మెల్యే కావాలంటే పేమెంట్ ఇవ్వాల్సిందేనని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఇందిరమ్మను అవమానించారని.. తెలంగాణ, ఆంధ్రా ఉద్యమంలో ఇందిరా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీ స్థాపించారని.. సెంట్రల్ యూనివర్సిటీలో ఇందిరాగాంధీ నాటిన మొక్కను తీసిన కలుపు మొక్కలు మీరు అంటూ ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇచ్చిన భూమిని రూ. 30వేల కోట్లకు అమ్మాలని గుంటనక్కలు చూస్తున్నాయని.. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పడం ఒక బోగస్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. నాడు గురువు భూమి ఇచ్చిపోతే.. నేడు శిష్యుడు భూమిని అమ్ముతున్నాడని మండిపడ్డారు. 2004లో వైఎస్ సీఎం అయ్యాక భూకేటాయింపులు రద్దు చేశాక.. ఎట్లా రద్దు చేస్తారని రేవంత్ రెడ్డి అన్నారని.. నాడు చంద్రబాబు నాయుడు కేంద్రంలో కీలకంగా ఉన్నారు కాబట్టి 400 ఎకరాల భూమిని బిల్లీరావు అనే ప్రైవేటుకు వ్యక్తికి ఇచ్చారని.. రాజ్యాంగ సవరణ ద్వారా 2,300 ఎకరాలు సెంట్రల్ యూనివర్సిటీకి కేంద్రం ఇచ్చిందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి ఇచ్చిన భూమిని టాటా కంపెనీకి 200 ఎకరాలు, ఇంకో కాలేజీకి 100 ఎకరాలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 370 ఎకరాల భూమి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో లేదన్నారు. 400ఎకరాల భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమని.. 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి తనఖా పెట్టి రూ. 30వేలకోట్లు తీసుకున్నారన్నారు.

400 ఎకరాల భూమిని వేలం వేసే విధంగా ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. 400 ఎకరాలు కాపాడేందుకు రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్ చేసిన ప్రయత్నం లేదా..? అంటూ ప్రశ్నించారు. 400 ఎకరాలు మేమే తెచ్చినట్లు రేవంత్ రెడ్డి క్రెడిట్ కొట్టేస్తున్నారని.. దామగుండంలో అడవులను మొత్తం నరికారని.. అంబేద్కర్ యూనివర్సిటీ భూములను కొల్లగొట్టాలని చూస్తున్నారన్నారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం కన్నుపడిందని.. నాటి చంద్రబాబు.. నేటి రేవంత్ రెడ్డి పాలనకు తేడా లేదన్నారు. 16 నెలల్లో కాంగ్రెస్ పార్టీ విధ్వంసం చేసిందని.. సర్క్యులర్ ఇచ్చి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను రెచ్చగొట్టారని.. ఇప్పుడు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులతో పెట్టుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలు తారుమారు అయ్యాయని.. భూములను అమ్మి ప్రభుత్వాన్నినడుపుతున్నారని విమర్శించారు.

## అసెంబ్లీలో రేవంత్ వ్యాఖ్యలపై 'సుప్రీం' ఆగ్రహం.. సీఎంను హెచ్చరించాలని న్యాయవాదికి సూచన..!

తెలంగాణ అసెంబ్లీలో ఎవరు పార్టీ మారినా ఉప ఎన్నికలు రావు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి మారినా ఉప ఎన్నికలు రావంటూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేసిన విషయం తెలిసిందే. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సుందరం సీఎం ప్రకటనను బెంచ్‌కు చదివి వినిపించారు. 'గౌరవనీయులైన స్పీకర్ సర్ తమరి ద్వారా నేను ఒకటి చెప్పదలుచుకున్న. ఎవరైతే సభ్యులున్నరో వాళ్లు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఏ ఉపఎన్నికలూ రావు. వారు కోరుకున్నా ఉపఎన్నికలు రావు. అటోళ్లు ఇటొచ్చినా, ఇటోళ్లు అటుపోయినా ఉపఎన్నికలు రావు' అంటూ వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై జస్టిస్ గవాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో ఇలా చెప్పి.. సీఎం పదో షెడ్యూల్‌ను అపహాస్యం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. తాను సీఎం తరఫున హాజరుకాకపోవడంతో ఆ ప్రకటన గురించి వివరించలేకపోతున్నారని తెలిపారు. గతంలోనూ మరో కేసులో సీఎంని మందలించిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. 2024 ఆగస్టులో 2015 నాటికి ఓటుకు నోటు కేసు విచారణను బదిలీ చేయాలన్న పిటిషన్‌ను విచారణ సమయంలో జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కే కవితకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. చట్టసభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ని సీఎం స్థాయి హోదాలో ఉన్న అపహాస్యం చేయడం కిందకే వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది.

## నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా చూస్తూ ఉండాల్సిందేనా?: సుప్రీంకోర్టు



మొదటి పేజీ తరువాయి

తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల భారాస నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

"స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుంది. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు" అని ముకుల్ రోహత్గీ వాదించారు.

అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో.. ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని.. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు. "2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు" అని కోర్టుకు తెలిపారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై కేసీఆర్ సన్నాహక సమావేశం..!



భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమవేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు సూచించారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని నేతలకు సూచించారు.

సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన నేతలు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## గురువు చంద్రబాబు బాటలో.. శిష్యుడు రేవంత్‌రెడ్డి : జగదీశ్‌రెడ్డి

%ఙ్ఖుస్త్రుఱఅంష్ట్ర =వఎఎఎ% ఎ కేసీఆర్ హరితహారం చేస్తే.. కాంగ్రెస్ హరిత సంహారం చేస్తోందని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ వ్యవహారంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై ఆయన నిప్పులు చెరిగారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న జంతువులు చిత్రహింసలకు గురవుతున్నాయని.. తమ బాధ్యత కాకపోయినా విద్యార్థులు పోరాటం చేస్తున్నారన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అధికారులతో మాట్లాడి.. పోలీసులను అడ్డుకోవచ్చన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి నాటకం ఆడుతున్నాయని.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే సెంట్రల్ యూనివర్సిటీలోకి రాకుండా పోలీసులను అడ్డుకోవచ్చన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ అధికారిగా వీసీ ఉంటారని.. డ్రోన్ కేమెరాలతో జేసీబీ వీడియోలు తీస్తే ఐదుగురు విద్యార్థులను అరెస్టు చేశారన్నారు.

### హైడ్రా, రంగనాథ్ ఎక్కడా?

బీజేపీ సహాయంతోనే రేవంత్ రెడ్డి 400 ఎకరాల భూమిని తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు ఉంటుందని, పార్కులను, అడవులను ప్రభుత్వం అమ్ముతుందా ? అని ప్రశ్నించారు. సెంట్రల్ యూనివర్సిటీపై రేవంత్ రెడ్డికి హక్కు లేదని.. సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ని ఎకరాలు ఉన్నాయో ఇప్పటి వరకు తెలియదన్నారు. ఫోర్త్ సిటీలో, ఫ్యూచర్ సిటీలో భూమి ఇచ్చుకోవచ్చు కదా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గురువు లాగా అద్భుతమైన ఫోర్త్ సిటీ కడతామని రేవంత్ రెడ్డి అంటున్నారని.. 400 ఎకరాలు ప్రభుత్వానిది అయితే దొంగల్లాగా అర్ధరాత్రి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. 400 ఎకరాల భూముల్లో ప్రభుత్వ పెద్దల చీకటి కోణం ఉందని.. 400 ఎకరాల భూమిపై చీకటి ఒప్పందం ప్రభుత్వం చేసుకుందని ధ్వజమెత్తారు. ఐటీ పార్కులు ఫోర్త్ సిటీలో ఎందుకు కట్టకూడదు..? చాలా ఐటీ పార్కుల్లో స్థలం ఉందని.. గురువు రియల్ ఎస్టేట్ దందా కోసం భూమిని ప్రైవేటు వాళ్లకు కట్టబెట్టారో ఇప్పుడు శిష్యుడు అదే బాటలో నడుస్తున్నారన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో మూడు చెరువులు ఉన్నాయని.. హైడ్రా, రంగనాథ్ ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదన్నారు. సేవ్ హెచ్‌సీయూ అనే స్లోగన్‌కు ఐదులక్షల మంది మద్దతు తెలిపారని.. ఐదు లక్షల మంది పేయిడ్ బ్యాచేనా? అంటూ ధ్వజమెత్తారు.

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి

మెట్రో రైల్ సమయం పొడిగించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ సమయాన్ని పొడిగించారు హైదరాబాద్ మెట్రో అధికారులు. మారిన టైమింగ్స్ ప్రకారం.. ఇక మీదట సోమవారం నుంచి శుక్రవారం వరకు.. ఆయా టెర్మినల్ స్టేషన్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల 45 నిమిషాల దాకా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. శనివారం నాడు ఆయా టెర్మినల్ మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు తొలి మెట్రో స్టార్ట్ అవుతుంది. రాత్రి 11 గంటల వరకు రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక నుంచి ఆదివారం నాడు ఉదయం 7 గంటలకు ఆయా టెర్మినల్ స్టేషన్ నుంచి ఫస్ట్ మెట్రో రైలు మొదలవుతుంది. సండే కూడా రాత్రి 11 గంటల వరకే రైళ్ల రాకపోకలు ఉంటాయి.

## అడవులో వణ్య ప్రాణాలు ఘోష వినపడటం లేదా..?

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి, అతనికి సహకరిస్తున్న మంత్రులందరిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలి. అప్పుడే తెలంగాణ సురక్షితంగా ఉంటుంది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఊర్లలో ఎడ్ల బండి మీద ఇల్లు కట్టడానికి వాగు నుండి తట్ట ఇసుకను తీసుకపోతే ఆ బండిని సీజ్ చేసి స్టేషన్‌లో పెట్టే పోలీసులు, రెవెన్యూ అధికారులకు.. అడవిలో వన్యప్రాణుల ఘోష వినిపించడం లేదా..? బుల్డోజర్లు కనిపించడం లేదా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ ఎక్కడ? విద్యార్థులను కిరాయి ఉద్యమకారులన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి రియల్ దందాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ కడుతున్న కట్టడాలను ప్రజలు ఎవరూ కొనకుండా బహిష్కరించాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల్లో రేపటివరకు పనులు ఆపాలి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరఫున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. "గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీ కి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి" అని కోర్టుకు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ఏజీ వాదనలు వినిపించారు. ఇప్పటివరకు ఈ భూమి అటవీ భూమి అని ఒక్క వాదన కూడా లేదు. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని.. అటవీ భూమి కానే కాదన్నారు. నిజాం కాలం నుంచి ఈ భూమి.. బీడు భూమిగానే ఉందని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ 400 ఎకరాలు పరిశ్రమల భూమి అని రికార్డుల్లో ఎక్కడైనా ఉందా? అని హైకోర్టు ఏజీని ప్రశ్నించింది. సర్వే నెంబర్ 25లో ఉన్న ఈ భూములను పలు అవసరాలకు కేటాయిస్తూ వచ్చారని న్యాయస్థానానికి తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

## అక్రమ మైనింగ్ కేసు.. కాకాణి గోవర్ధన్‌కు మరోసారి నోటీసులు




మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి నెల్లూరు జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలోని కాకాణి నివాసానికి వెళ్లిన కావలి డీఎస్పీ నేతృత్వంలోని పోలీసు బృందం.. ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కాకాణి ఇంట్లో లేరని చెప్పడంతో ఆయన బంధువులకు నోటీసులు ఇచ్చారు. అక్రమ మైనింగ్ కేసులో ఏప్రిల్ 3న (గురువారం) నెల్లూరు రూరల్ డీఎస్పీ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సార్లు కాకాణికి నోటీసులు అందజేసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు.

# 400 ఎకరాల యూనివర్సిటీ భూములపై రగడ

# రోహిత్ వేములను మరచిన కాంగ్రెస్ కమ్యూనిస్టులు

**– హెచ్ సి యు కేవలం రాజకీయ ఆటల కొరకేనా**

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

2016 సంవత్సరం జనవరి 17 న రోహిత్ వేముల ఆత్మహత్య ఉదంతతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆ రోజుల్లో ప్రముఖంగా వార్తల్లో నిలిచింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అని అన్నా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అని అన్నా రెండూ ఒకటే. మొదటినుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీగా ప్రాచుర్యం పొందిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ దేశంలోని 10 ప్రముఖ యూనివర్సిటీలో ఒకటి.రోహిత్ వేముల మరణం రాజకీయాల్లో ఒక ప్రముఖ అంశంగా నిలిచింది. రోహిత్ వేముల కులము దళితుడని,రోహిత్ మరణం ఒక వేధింపు అని అతని తల్లి శ్రీమతి రాధికను ప్రముఖంగా నిలిపి కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు, మిగతా కొన్ని రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా ప్రదర్శనలు చేశాయి. రోహిత్ వేముల మరణం వెనక ఉన్న కారణాలు ఏమైనప్పటికీ, ఆ సంఘటనను రాజకీయ లబ్ధి కొరకు పార్టీలన్నీ ఉపయోగించుకున్నాయి.రోహిత్ వేముల ఫోటోతో దేశవ్యాప్తంగా, ఇంకా చెప్పాలంటే ప్రపంచవ్యాప్తంగా ఒక చర్చకు తెర లేపారు.ఇక రోహిత్ అవసరం లేదని భావించిన ఈ పార్టీలు మెల్ల మెల్లగా రోహిత్ వేములను మరిచిపోయాయి.కొద్ది కాలం తర్వాత రోహిత్ వేముల తల్లి రాధిక మీడియా ముందుకు వచ్చి తన గోడు వెల్లబోసుకున్నది. రాజకీయ పార్టీలు చెప్పినట్టు ఆయా పార్టీల స్క్రిప్టును అనుసరించి నేను దేశవ్యాప్తంగా తిరిగానని, దీనికి బదులుగా నాకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తామని కమ్యూనిస్టు పార్టీలు ఆశ చూపాయని, కానీ ఈ ప్రదర్శనల్ని ముగిసిన తరువాత నాకు ఒక్క పైసా ఎవ్వరు ఇవ్వలేదని రోహిత్ వేముల పల్లి రాధిక బహిరంగంగా వాపోయింది. రోహిత్ వేముల మరణ ఉదంతంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పేరు ప్రముఖంగా వార్తల్లో నిలిచింది.

**– రోహిత్ వేముల పేరు వింటేనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గుర్తుకొస్తుంది**

మెల్ల మెల్లగా రోహిత్ వేముల మరణం యొక్క ప్రభావం పల్చబడిపోయింది. ఇంకా చెప్పాలంటే జనం రోహిత్ వేములను మరచిపోయారు.హైదరాబాదులోని హెచ్ సి యు ని ఢిల్లీ జే ఎన్ టి యు మాదిరిగా ఒక కార్య క్షేత్రంగా మలచాలని అన్ని రకాల కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రయత్నించారు.ఢిల్లీ జె ఎన్ టి యు లోని "తుకుడే తుకుడే గ్యాంగుల" మాదిరిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కూడా విచ్ఛిన్నకర శక్తులను పెంచి పోషించాలని చూసిన




శక్తులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఇప్పుడు పట్టించుకోవడం మానేశారని అనిపిస్తుంది.రోహిత్ వేముల తల్లి రాధికను తీసుకొని రాహుల్ గాంధీ కూడా ప్రదర్శనలు చేసిన విషయం విజ్ఞులు విద్యార్థులు జనం మరచిపోలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత,కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో అవసరం తీరిపోయిందా అని విద్యార్థి లోకం ఇప్పుడు బహిరంగంగా ప్రశ్నిస్తున్నది.ఇక అసలు విషయం లోనికి వస్తే హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీకి ప్రభుత్వం కేటాయించిన దాదాపు 2500 ఎకరాల భూమిలో నాలుగు వందల ఎకరాలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వము అన్యాక్రాంతం చేయాలనుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆరోపణలే కాదు అందుకు సంబంధించిన చర్యలు ప్రభుత్వము చేపట్టినట్టు సాక్ష్యాలు కూడా కనిపిస్తున్నాయి. హెచ్ సి యు కు సంబంధించిన స్థలము అన్యాక్రాంతము చేయడము లేదా రియల్ ఎస్టేట్ కొరకు ఉపయోగించడం పట్ల విద్యార్థిలోకం ప్రదర్శనలు చేస్తున్నది. విద్యార్థులపై లాఠీ చార్జీలు దమన నీతిని అందరూ ఖండిస్తున్నారు.ఢిల్లీ జే ఎన్ టి యు లో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అప్పుడు పిడికిళ్ళు బిగించి "హం లడ్ కే లేంగే ఆజాది" అని నినాదాలు ఇచ్చిన కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలన్నీ ఇప్పుడు ఏమైపోయాయి. ఇప్పుడు హెచ్ సి యు లో ఈ కమ్యూనిస్టు విప్లవ విద్యార్థి సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయి అని బాహాటంగా ప్రశ్నలు వినిపిస్తున్నాయి.దేశంలో విద్యార్థి లోకాన్ని కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కొరకు మాత్రమే పార్టీలు ఉపయోగించుకుంటాయా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.విద్యార్థులపై జులుం మాత్రమే కాకుండా అరెస్టులు చేసి లాకప్పు ల్లో వేసి, జైలుకి పంపడం పట్ల కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు ఎందుకు మౌనంగా ఉన్నాయని జనం ప్రశ్నిస్తున్నారు.ఈ విద్యార్థుల డిమాండ్ పట్ల, యూనివర్సిటీ భూముల వేలం పట్ల భారతీయ జనతా పార్టీ ఒక్కటే బహిరంగ పోరాటానికి, పార్లమెంటులో పోరాటానికి కాలు దువ్వినట్టు కనిపిస్తోంది.పార్లమెంటు సభ్యులు అరవింద్, ఈటెల, విశ్వేశ్వర్ రెడ్డి బహిరంగ ప్రెస్ మీట్ లు నిర్వహించి ప్రభుత్వ చర్యలను ఖండించారు. బిజెపి కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి కూడా హెచ్ సి యు విద్యార్థుల డిమాండ్లను సమర్థిస్తూ సంఘీభావం తెలిపారు.అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకుడు డాక్టర్ లక్ష్మణ్ రాజ్యసభలో కూడా హెచ్ సి యు భూముల విషయం లేవనెత్తారు.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ యూనివర్సిటీ భూముల అమ్మకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఇలా హైదరాబాద్ యూనివర్సిటీ భూముల అమ్మకం ఒక పెను దుమారం లేపింది.అప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తో పాటు ఉపముఖ్యమంత్రి బట్టి




విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు తో పాటు ఇతర నాయకులు ప్రెస్ మీట్ లో ఈ వ్యవహారంపై స్టేట్ మెంట్ లు ఇచ్చారు.ఈ భూములను గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అన్యాక్రాంతం చేసిందని ఆ భూములపై కోర్టులో ఉన్న కేసుల పట్ల కనీసం స్పందించలేదని, మా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కోర్టులో కేసు కొట్లాడి ప్రభుత్వానికి అనుకూల తీర్పు వచ్చేటట్లుగా కృషి చేసిందని కాంగ్రెస్ మంత్రులు అన్నారు. యూనివర్శిటీకి చెందిన ఒక్క ఇంచు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**– ఇది ప్రకృతి విధ్వంసం .. కపిలవాయి దిలీప్ కుమార్**

యూనివర్సిటీ భూముల్లో దేశ విదేశ పక్షులకు నిలయంగా ఉన్న ప్రకృతిని వృక్ష సంపదను వన్య సంపదను ధ్వంసం చేయడం తప్పు అని మాజీ అటవీ శాఖ అధికారి, రాజకీయ నాయకుడు శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ ప్రభుత్వ చర్యలను విమర్శించారు.సుప్రీంకోర్టులో కేసు గెలిచిన ప్రభుత్వము చట్టపరంగా ఈ భూములను స్వాధీనం చేసుకోవడం, మల్టీ నేషనల్ కంపెనీస్ కి ఇవ్వడము ప్రభుత్వ అధికారం కావచ్చు. హైడ్రా పేరు మీద, మూసీ ప్రక్షాళన పేరు మీద, చెరువులు కుంటల రక్షణ పేరు మీద, ఆక్రమణలను తొలగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ పని వదిలిపెట్టి యూనివర్సిటీ భూములను ఇతరులకు అప్పగించడం సరైన సమర్థనీయమైన చర్య కాదని అన్నారు.
ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేయాలని అనుకుంటే, యూనివర్సిటీ కి దగ్గరలో చాలా భూములు వందల ఎకరాల్లో కబ్జాలో ఉన్న విషయం ప్రభుత్వానికి తెలియదా?. ఆ భూములను ప్రభుత్వము చట్టబద్ధంగా స్వాధీనం చేసుకొని బహుళ జాతి కంపెనీలకు అప్పగిస్తే అందరూ హర్షించేవారు. విద్యార్థుల ఉసురు తీసి యూనివర్సిటీ భూములను ఇలా పరాధీనం చేయడం హర్షనీయం కాదని అన్నారు.
ఏ పార్టీ ప్రభుత్వం అయినా విద్యార్థుల ప్రయోజనాలు, యూనివర్శిటీ ఆస్తుల సంరక్షణ చేయాల్సిన బాధ్యత ఉంది. ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూమి ఏ ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని, ఉస్మానియా యూనివర్సిటీ కంటే అధికమైన భూవిస్తీర్ణం కల హెచ్ సి యు ను, దాని ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని విద్యార్థి లోకం తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నది.విద్యాలయాలను, యూనివర్సిటీలను రాజకీయ ప్రయోజనాల కొరకు ఉపయోగించు కోకూడదని విద్యార్థి మేధావి లోకం తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వినిపిస్తున్నారు.
"కదన రంగమే నీ కళాశాల రా విప్లవమే నీ విద్యాలయం రా" అని ఒకనాడు కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు నినాదాలు ఇచ్చే వారిని వారి కార్యాచరణ కూడా అదేవిధంగా ఉండేదని రాజకీయ పండితులు గుర్తు చేశారు. అది తప్పుడు కార్యక్రమం అని రుజువయిందని విద్యార్థి లోకం, మేధావులు అంటున్నారు.

**విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండడం అత్యంత అవసరం.**

సామాజిక స్పృహ అంటే దశ దిశ లేని పోరాటం కాదని, బాధ్యతారాహిత్య కార్యక్రమం కాదని విద్యార్థి లోకం గుర్తించింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల విక్రయం వెంటనే నిలిపివేసి యూనివర్సిటీ ఆస్తులను కాపాడాలని బిజెపి ఎంపీ లు ఇచ్చిన పిలుపు సమంజసంగా కనిపిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో ఉన్న 400 ఎకరాల భూమిని ప్రభుత్వంగాని, ప్రైవేటు వ్యక్తులు గాని ఆక్రమించుకోకూడదని విద్యార్థి లోకం పోరాటం చేస్తున్నది.ఆ భూముల్లో నెమళ్లు, జింకలు, తాబేల్లు, వివిధ జాతులకు చెందిన పక్షులు ఇంకా ఎన్నో వన్య జీవులు పర్యావరణ జీవితానికి ఒక ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఈ భూముల అమ్మకంతో అక్కడ పర్యావరణ విచ్ఛిన్నం జరుగుతున్నదని పోరాడుతున్న యూనివర్సిటీ విద్యార్థుల డిమాండ్ ను అందరూ సమర్థిస్తున్నారు. ఉచిత పథకాలు ప్రకటించి ఆర్థిక లోటును కావాలని సమకూర్చుకుంటున్న ప్రభుత్వాలు, ఇలా ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పోతే చివరికి రాష్ట్రము దేశము ఏమవుతుందని జనం ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్ముకోవాలనుకుంటున్న ప్రభుత్వం భవిష్యత్ అవసరానికి మించి ఇకపై ఇంకెక్కడి భూములు అమ్ముకుంటుందని అన్ని రాజకీయ పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.శాస్త్రీయత లేని ఆర్థిక ప్రణాళికలతో ప్రభుత్వాలు ఎక్కువ కాలం పరిపాలించలేవని విశ్లేషకులు తమ ఆవేదన వెలిబుచ్చుతున్నారు.ఓట్ల కొరకు సీట్ల కొరకు అధికారం కొరకు ఉచిత పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని దివాలా తీయించి ఎక్కువ కాలం ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని విద్యార్థి లోకం తమ నిరసనను తెలియజేస్తున్నాయి.ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్ లో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర ఆర్థిక దివాలా పరిస్థితిని బహిరంగంగా ఒప్పుకున్నారు.ఆర్థిక లోటుతో రాష్ట్ర నిర్వహణ కష్టంగా మారిందని నేను అధికార కుర్చీలో కూర్చున్న తర్వాత ఈ విషయం అర్థం అయిందని శ్రీ రేవంత్ రెడ్డి గారు అన్నారు. ఇలా విషయాన్ని ఉన్నది ఉన్నట్టు ఒప్పుకోవడం మంచి పరిణామం.మీడియా ముందు చెప్పిన విషయాన్ని రాష్ట్ర ప్రజలకు కూడా చెప్పి అర్థం చేయించి ఉచిత పథకాలను రద్దుచేసి రాష్ట్రాన్ని స్వావలంబన వైపు నడిపించడమే సరైన మార్గము.మొన్న ఒక సమావేశంలో మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు గారు కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.ప్రజలకు విద్య వైద్యం మాత్రమే ఉచితంగా అందించాలని, మిగతా ఉచిత పథకాలు ఏవి ప్రకటించకూడదని, నిర్వహించకూడదని చెప్పారు.ఇది సరైన సూచన అని చాలామంది శ్రీ వెంకయ్య నాయుడు గారి అభిప్రాయాన్ని స్టేట్ మెంట్ ను సమర్థించారు.పాలక ప్రభుత్వాలు ఈ ఉచిత పథకాల కొరకు ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను అమ్ముతూ ఎక్కువ కాలం పాలించలేరని, కాబట్టి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అమ్మాలనుకుంటున్న భూములతో పాటు మిగతా ప్రజా ఆస్తులను ఏవి అమ్మకూడదని విద్యార్థి లోకం బహిరంగంగా ప్రభుత్వాన్ని కోరుతున్నది.పోరాట పార్టీలుగా చెప్పుకునే కమ్యూనిస్టులు విద్యార్థి లోకాన్ని వారి సమస్యలను గాలికి వదిలేయడము పట్ల ప్రజలు విస్తు పోతున్నారు. అయినదానికి కాని దానికి రాజ్యాంగం చేతబట్టుకునే కాంగ్రెస్ నాయకులు ఇలా ప్రజా ప్రయోజనాల విరుద్ధ వైఖరిని అనుసరించడం, ఆచరించడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యారంగం ప్రయోజనాలను పణంగా పెట్టి విద్యావ్యవస్థనే నిర్వీర్యం చేసే ధోరణి తో ఏ ప్రభుత్వము పనిచేయకూడదు.
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆస్తులను సంరక్షించడానికి మొత్తం భూముల చుట్టూ పటిష్టమైన ప్రహరీ గోడ నిర్మించాలని యూనివర్సిటీ నుంచి భవిష్యత్తు మేధావులను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వాలు దోహదపడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# మెట్ పల్లి బాలుర జెడ్.పి.హెచ్.ఎ.స్ కు శుద్ధ జల ఆర్.ఓ ప్లాంటు వితరణ

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

సమాజంలో పలువురికి ఉపయోగపడే స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేట్ అట్లాంటా, తెలంగాణ సొసైటీ (జిఎటీఎస్) అట్లాంటా అమెరికా గారి సౌజన్యంతో మెట్పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల యందు విద్యార్థుల తాగునీరు అవసరం గుర్తించి ఆర్ ఓ శుద్ధ జల ప్లాంట్ పాఠశాలలో అమర్చడం జరిగింది. 500 లీటర్ల కెపాసిటీ గల ఓవర్ హెడ్ ట్యాంకు, గంటకు 100 లీటర్ల మంచినీటిని అందించే ప్లాంటు సుమారు 50 వేల రూపాయల విలువ కలిగినది పాఠశాలకు అందజేయడం జరిగింది.గ్రేట్ అట్లాంటా తెలంగాణ సోసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ చంద్రశేఖర్ అల్తాటి, ప్రెసిడెంట్ నవీన్ బత్తిని, చైర్మన్ నవీన్ ఉజ్జిని అండ్ జిఎటిఎస్ టీం సహకారంతో స్థానిక వెల్లుల్ల గ్రామ వాస్తవ్యులు బత్తిని శంకర్ గౌడ్ గారి సారధ్యంలో మిట్టపెల్లి సాయికుమార్ సమక్షంలో, ఏం చంద్రశేఖర్ మండల విద్యాధికారి మెట్ పల్లి గారి చేతుల మీదుగా



ప్రధానోపాధ్యాయులు కె నారాయణ గారికి అందించడం జరిగింది. 300 కు పైగా విద్యార్థులు అభ్యసిస్తున్న తమ పాఠశాలకు ఆర్ ఓ వాటర్ ప్లాంట్ అందించడం పట్ల ప్రధానోపాధ్యాయులు కె నారాయణ జిఎటిఎస్ టీమ్ అట్లాంటా అమెరికా గార్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కే.నారాయణ ప్రధానోపాధ్యాయులు, ఏం చంద్రశేఖర్ మండల విద్యాధికారి మెట్ పల్లి, బత్తిని శంకర్ గౌడ్ వెల్లుల్ల, మిట్టపల్లి సాయికుమార్, ఉపాధ్యాయులు మద్దిరాల గణేష్, బత్తుల శివప్రసాద్, నారంబట్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేశవపట్నం బస్టాండ్ లో చలివేంద్రం ప్రారంభం ...

**– ప్రయాణికుల సద్వినియోగం చేసుకోవాలి...**
**– ఎంపీడీవో కృష్ణ ప్రసాద్..**

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 2**

ప్రయాణికుల సౌకర్యార్థం వేసవికాలం సందర్భంగా కేశవపట్నం బస్టాండ్ లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికుల దహార్ది తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. వేసవికాలం ఎండ తీవ్రత తో ప్రయాణికులకు దాహం ఎక్కువగా ఏర్పడుతుందని, ప్రయాణికుల దాహార్ తీర్చడానికి, గ్రామపంచాయతీ సౌజన్యంతో బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రయాణికులు తమ దాహార్తిని తీర్చుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాసగోని ప్రభాకర్, కార్యదర్శులు దురిశెట్టి నరసయ్య ,వీర ప్రతాప్ ,కాంగ్రెస్ నాయకులు బండారి తిరుపతి, ఇస్లాముద్దీన్, మొలంగూరి సదానందం, గ్రామపంచాయతీ సిబ్బంది. ఆటో కార్మికులు , తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు..

**– నివాళి అర్పించిన గౌడ సంఘం నాయకులు..**

**కరపత్రంశంకరపట్నం ఏప్రిల్ 2**

బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నంలో పాపన్న విగ్రహం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడారు. మండల కేంద్రంలోని విప్లవ వీరుడు గోల్కొండ కోటను అధిరోహించిన తొలి బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతిని పురస్కరించుకొని గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి, సర్వాయి పాపన్న జీవితం బహుజనులందరికీ స్ఫూర్తిదాయకమని పాపన్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాదులో ఘనంగా డిసిసిబి బ్యాంక్ సంబరాలు

**కరపత్రం బాన్సువాడ ఏప్రిల్ 2**

సహకార సంఘాల బ్యాంకుల ద్వారా ఆర్థిక సంవత్సరం సాధించిన ప్రగతి రుణాల చెల్లింపులో ఆశాజనక ఫలితాలు వచ్చినందుకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా సహకార బ్యాంకులో డిసిసిబి డైరెక్టర్లను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిసిసిబి డైరెక్టర్ కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ సహకార బ్యాంకుల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. సహకార సంఘాలు బలోపేతం కావాలంటే రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే సహకార బ్యాంకులో మరింత అభివృద్ధిలోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి నాగభూషణం, డైరెక్టర్లు సాయిరాం, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కరపత్రం తెలుగు దిన పత్రిక

గురువారం ఏప్రిల్ 03 2025

## నేడు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్న దుద్దిల్ల శ్రీను బాబు




**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 02**
రామగిరి రామగిరి మండలంలోని రత్నాపూర్ (బేగంపేట x రోడ్డు) గ్రామానికి చెందిన మిత్రులు యూత్ కాంగ్రెస్ నాయకులు బండారి శివ, గిరవేన ప్రవీణ్, పాశం సాయి ల నూతన వాణి సోడా ఫ్యాక్టరీ ప్రారంభించడానికి విచ్చేస్తున్న యువ నాయకులు,శ్రీ పాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు, తదితరులు పాల్గొననున్నారు.

## ఐఎన్టిఎస్ఓ ఫలితాలలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



**కరపత్రం -హుజురాబాద్:**
హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య కరికులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రకటించిన ఐఎన్టిఎస్ఓ ఫలితాలలో సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపల్ మాట్ల సందీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఐ ఎన్ టి ఎస్ ఓ లెవెల్ టు పరీక్షలో శ్రీ కాకతీయ విద్యార్థులు శ్రీ హర్షిత, చిలుకమారి వర్షిని, సకినపల్లి శ్రీజ, మేఘాన్స్, భరత సాత్విక అభినందిక, పలలేని సాయి పొద్దుటూరు సహస్ర రెడ్డి సత్తా చాటారన్నారు. నేషనల్ లెవల్ లో వరుసగా మొదటి రెండవ మూడవ నాలుగవ మరియు ఐదో బహుమతులు పొందారని ఇవే కాకుండా 78 మందికి కన్సోలేషన్ ప్రైసెస్, ఏడుగురికి స్పెషల్ ప్రైసెస్ పొందారని పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం ముద్రగోల రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డిఎన్ శ్రీనివాస్, రజిత, మల్లేష్, అనూష తదితరులు పాల్గొన్నారు

## జై బాపు,జై భీమ్, జై సంవిధన్ అభియాన్ సన్నాహక కార్యక్రమం

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 02.**
తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశానుసారం రామగిరి తేదీ 03-04-2025 గురువారం రోజున రామగిరి మండలంలోని సుందిళ్ల గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, సుందిళ్ల గ్రామంలో జై బాపు,జై భీమ్, జై సంవిధన్ అభియాన్ సన్నాహక కార్యక్రమం కలదు.ఈ సన్నాహక కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సహకార ఆయిల్ సీడ్స్, ఉత్పత్తిదారుల కార్పొరేషన్ చైర్మన్ మరియు కార్యక్రమ కోఆర్డినేటర్ జంగా రాఘవరెడ్డి మరియు యువ నాయకులు దుద్దిళ్ల శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొంటారు.కావున రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని రొడ్డ బాపన్న రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,పేరాల మహేశ్వర్ రావు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్,జనగామ కృష్ణ సుందిల్ల గ్రామశాఖ అధ్యక్షులు కోరారు.

## డిల్లీలో సంజయ్ కుమార్ చేస్తున్న దీక్షకు మద్దతు, సంఘీభావం తెలిపిన పిసిసి అధ్యక్షులు, మంత్రి, విప్ లు ,ఎమ్మెల్యేలు...

- సంజయ్ కుమార్...

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 2**




ఢిల్లీ జంతర్ మంతర్ లో దీక్ష చేపడుతున్న బీసీ ఆజాది వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ కు తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యేలు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపినట్లు జక్కని సంజయ్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడారు. బీసీలకు 12 శాతం రిజర్వేషన్ కోసం చేపట్టిన దీక్షకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్యులు కొండ సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బిర్లా ఐలయ్య, ఎంఎల్ఏలువాకిటి శ్రీహరి, మక్కన్ సింగ్ రాజు ఠాకూర్ తదితరులు జక్కని సంజయ్ కుమార్, బత్తుల సిద్దేశ్వర్ కు బీసీ ఆజాది సత్యాగ్రహ దీక్షకు సంపూర్ణ మద్దతును తెలిపినట్లు సంజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి సంజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# పేదలకు అండ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం...

**- దేశంలో ఎక్కడ లేని సన్న బియ్యం పథకం ప్రారంభం..**
**- కృతజ్ఞతలు తెలిపిన ఏఎంసి వైస్ చైర్మన్ తిరుపతి..**

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 2**
తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలకు అండగా ఉందని, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి బుధవారం అన్నారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,శంకరపట్నం మండలంలోని తిరుపతి స్వగ్రామం కాచాపూర్ గ్రామంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ప్రజా పాలన అందించే లక్ష్యంగా రాష్ట్రంలోని పేద బడుగు ,బలహీన వర్గాలకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందజేయడం జరుగుతుందని, అందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాన్ని తెలంగాణలో ముఖ్యమంత్రి



ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము ఎమ్మెల్యేలు పేదలకు సన్నబియ్యాన్ని అందజేసి ఆహార కొరత లేకుండా ప్రతి పేద కుటుంబానికి బుక్కెడు బువ్వ పెట్టాలని లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము దేశంలో ఎక్కడలేని సన్న బియ్యం పథకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టి తెలుగు సంవత్సరాది ఉగాది పండగ రోజున రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల చేతులమీదుగా ప్రారంభించి, ఉగాది పండగ నుండి ప్రతి పేద తెలుపు రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. పేదల కోసం సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గానికి, ఎమ్మెల్యేలకు ఈ సందర్భంగా తిరుపతి కృతజ్ఞతలు తెలిపి, అర్హులైన ప్రతి ఒక్కరు ఉచిత సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని తిరుపతి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ కనుకుంట్ల శంకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్, నాయకులు లింగంపల్లి మల్లారెడ్డి, కృష్ణారెడ్డి , తిరుమల్ల మధుకర్ రెడ్డి, వీరయ్య, సతీష్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదోన్నతుల ద్వారానే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం

**- పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది**
**- రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా**
**- 51 మంది కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి..**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 02:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 51 మంది కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్ లుగా పదోన్నతి పొందిన అధికారులకు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోరే ఝా వారి కార్యాలయంలో అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నాంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి



పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ గారు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఈ సందర్భంగా సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎఓ శ్రీనివాస్, ఆర్ ఐ శ్రీనివాస్, సూపరిండెంట్ లు సందీప్, మనోజ్ కుమార్, సిసి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

**- చింతగుట్టలో సన్నబియాని ప్రారంభించిన మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్...**

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 2**
తెలంగాణలో ప్రజా ప్రభుత్వము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ సభ్యులు శంకరపట్నం మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని చింతగుట్ట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ



సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. పేద బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని, పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ , ప్రజా ప్రభుత్వము ముఖ్యమంత్రులు ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము ఎమ్మెల్యేలు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడం జరుగుతుందని అందులో భాగంగా తెలుపు రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టి ఉగాది పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలుపు రేషన్ కార్డు లబ్ధిదారులకు ఏప్రిల్ మాసం నుండి అందజేయడం జరుగుతుందని,సన్న బియ్యం పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు

# భవిష్య వెల్ విషర్ ఆస్పత్రి లో అర్హత లేని డాక్టర్ల వల్ల ప్రమాదాలే

**- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య అధికారులు పర్యవేక్షించి ఆస్పత్రి యాజమాన్యానికి 5 లక్షల జరిమానా**
**- వైద్య అధికారి డాక్టర్ సి ఉమా గౌరీ**

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిది**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య అధికారులు తనిఖీ నిర్వహించడం జరిగింది ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతులు లేకుండా సేవలను ప్రకటన చేయడం, అర్హత కలిగిన మెడికల్ డైరెక్టర్ లేకపోవడం,అర్హత లేని సిబ్బందిని నియమించడం, అధిక శక్తి కలిగిన వైద్య మాత్రలు తప్పుడు వినియోగం, అనధికార వైద్య చికిత్సలు, మరియు లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బందిని నియమించకపోవడం నందున మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్లలోని భవిష్యా వెల్ విషర్ హాస్పిటల్ పై తీవ్రమైన చర్యలు తీసుకోబడ్డాయి.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సి ఉమా గౌరీ ,క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. గీతా,అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.వినోద్ గారితో పాటు రెవిన్యూశాఖ , పోలీసు అధికారుల సమక్షంలో హాస్పిటల్ లోని అనేక నియమ




ఉల్లంఘనలు గుర్తించబడ్డాయి, ఈ ఉల్లంఘనల ఆధారంగా, జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు తీసుకోబడ్డాయి.ఆసుపత్రి యాజమాన్యానికి రూ. 5,00,000 జరిమానా విధించబడింది, అదనంగా, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ 60 రోజులపాటు తాత్కాలికంగా రద్దు చేయబడింది. అలాగే, హాస్పిటల్ మేనేజ్మెంట్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసందుకు ఆదేశాలు. హాస్పిటల్ ప్రాంగణాన్ని తక్షణమే స్వాధీనం చేసుకుని, అనధికార వైద్య పద్ధతులు కొనసాగించకుండా అన్ని వైద్య పరికరాలు డయగ్నోస్టిక్ ఉపకరణాలు జప్తు చేయబడ్డాయి. ప్రజల ఆరోగ్య దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా సర్టిఫైడ్ డాక్టర్ల ద్వారా ఆసుపత్రి పూర్తి అనుమతులు పొంది చికిత్స అందించాలని లేనియెడల చట్టపరంగా తగు చర్యలు తీసుకోబడతాయని అన్నారు